సాక్షి నిజామాబాద్

బుధవారం । 12 । జూలై । 2023



స్కీం పేరుతో స్కాం
స్కీం పేరిట ప్రజలను ఆకర్షించి తీరా గడువు ముగిసినా బహుమతులు ఇవ్వకుండా నిర్వాహకులు ఇబ్బంది పెడుతున్నారు.
- 8లో ▸



లోటు పాట్లు సరిచేయాలి
పోడు భూముల పట్టాల్లో లోటుపాట్లను సరిచేయాలని ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ అధికారులను కోరారు.
- 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 34.5 /23.8

ఆకాశం మేఘావృతమవుతుంది. చలిగాలులు వీస్తాయి. జిల్లాలోని పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

ఖర్గేతో మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి భేటీ



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఢిల్లీ పర్య టనకు వెళ్లిన మాజీ మంత్రి, పీసీసీ కోశాధి కారి ప్రొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, ఆర్గనైజేషన్ ఇన్‌చార్జి కేసీ వేణుగోపాల్, ఏఐసీసీ కోశాధికారి పవన్ కుమార్ బన్సల్‌ను కలిశారు. తెలంగాణలో చోటుచేసుకుంటున్న రాజకీయ పరిణామాల గురించి వివరించారు. అదేవిధంగా ఢిల్లీలో ఉన్న పార్టీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి, పార్టీ ప్రధాన కార్యదర్శి మాణిక్‌రావు ఠాక్రే, ఏఐసీసీ సెక్రెటరీ ఇన్‌చార్జి రోహిత్ చౌదరిని కలిసి రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయాలు, కాంగ్రెస్ పార్టీ కార్యాచరణ విషయమై చర్చించారు.

ఉత్తమ ఆరోగ్య విస్తరణ అధికారిగా శంకర్



నిజామాబాద్ సిటీ: ఇందల్‌వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న వై శంకర్ జిల్లా ఉత్తమ ఆరోగ్య విస్తరణ అధికారిగా అవార్డు అందుకున్నారు. మంగళవారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా నగరంలోని టీఎన్‌జీవోస్ భవనంలో జరిగిన కార్యక్రమంలో మేయర్ నీతూకిరణ్, డీఎంహెచ్‌వో సుదర్శనం శంకర్‌కు అవార్డు అందజేశారు. సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకెళ్లడంలో కీలక పాత్ర వహించిన శంకర్‌కు ఈ అవార్డు లభించింది. డిప్యూటీ డీఎంహెచ్‌వో సరిత, మండల వైద్యాధికారి సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

బీసీలకు 60 శాతం టికెట్లు ఇవ్వాలి

- జీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్



నిజామాబాద్‌నాగారం: అన్ని పార్టీలు బీసీలకు 60 శాతం టికెట్లు ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. నగరంలోని కేర్ డిగ్రీ కళాశాలలో బీసీ కుల సంఘాల విస్తృత స్థాయి సమావేశం మంగళవారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు తెలంగాణ, ఆంధ్రలో బీసీ ముఖ్యమంత్రి కాకపోవడం శోచనీయమన్నారు. దామాషా ప్రకారం రిజర్వేషన్లు ఇవ్వాలని, లేకపోతే రాజకీయ పార్టీలైనా 60 శాతం టికెట్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. టికెట్లు ఇచ్చిన వారికే తమ మద్దతు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బండారి రాజు, నరాల సుధాకర్, బుస్స ఆంజనేయులు, ఆకుల ప్రసాద్, పోల్కం గంగా కిషన్, దర్శనం దేవేందర్, కొయ్యాడ శంకర్, శ్రీలత, కరిపే రవీందర్, ప్రవీణ్ గౌడ్, సాయిబాబా, సంజీవ్, హన్మంత్ రావు, లక్ష్మీనారాయణ రాజు, సత్యప్రకాశ్ పాల్గొన్నారు.

గాడి తప్పిన పాలన

తెయూ వీసీ రవీందర్ గుప్తా ఏసీబీకి చిక్కిన అనంతరం ఇన్‌చార్జి బాధ్యతలు ఎవరికీ అప్పగించక పోవడంతో వర్సిటీ పాలన గాడి తప్పింది. వీసీతో కలిసి అక్రమాలకు పాల్పడిన ప్రొఫెసర్లు విద్యావర్ధిని, కనకయ్యను సస్పెండ్ చేయాలని పాలకమండలి తీర్మానం చేసినా అమలు కాలేదు.



- వీసీ ఏసీబీకి పట్టుబడ్డాక..ఎవరికీ ఇన్‌చార్జి బాధ్యతలు ఇవ్వని ప్రభుత్వం
- అమలుకు నోచుకోని ఈసీ నిర్ణయాలు
- సస్పెండ్ కావాల్సిన వారితోనే కళాశాలల తనిఖీలు
- ఇదీ తెలంగాణ వర్సిటీలో పరిస్థితి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : తెలంగాణ విశ్వవిద్యాలయంలో గత రెండేళ్లుగా నెలకొన్న గందరగోళ పరిస్థితులకు ఫుల్‌స్టాప్ పెట్టడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో తగిన సమయంలో తగిన విధంగా నిర్ణయాలు తీసుకోవడంలో మీనమేషాలు లెక్కిస్తోంది. దీంతో ఇక్కడ పాలన తూతూమంత్రంగా తయారైంది. వర్సిటీలో చోటుచేసుకున్న అక్రమాల నేపథ్యంలో పాలకమండలి పలు కీలకమైన నిర్ణయాలు తీసుకుంది. వాటిపై తీర్మానాలు సైతం చేశారు. ఈ క్రమంలో గత నెల 17న వీసీ రవీందర్ గుప్తా ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఇన్‌చార్జి వీసీగా ప్రభుత్వం ఎవరికీ బాధ్యతలు అప్పగించలేదు. దీంతో పాలనా వ్యవహారాలతో పాటు ఆర్థికపరమైన ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. అనేక పనులు పెండింగ్‌లో పడుతున్నాయి. పరీక్షల విభాగం పనితీరు సైతం బాగా లేకపోవడంతో ఫలితాలు ప్రకటించే విషయంలో ఆలస్యం అవుతోంది.

సస్పెండ్ చేయాల్సింది పోయి..

వీసీతో కలిసి అనేక అవకతవకలకు, ఆర్థిక అక్రమాలకు పాల్పడిన మాజీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్లు విద్యావర్ధిని, కనకయ్యలను సస్పెండ్ చేయాలని పాలకమండలి తీర్మానం చేసినప్పటికీ ఇప్పటివరకు అమలు కాలేదు. రిజిస్ట్రార్ ఈ విషయంలో ముందుకు వెళ్లేందుకు ఎలాంటి అడ్డంకులు లేకున్నప్పటికీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని పాలకమండలి సభ్యులు చెబుతున్నారు. విద్యావర్ధినిని తక్షణమే సస్పెండ్ చేయాలని గత నెల 17న పాలకమండలి తీర్మానం చేసినప్పటికీ చేయలేదు. పైగా ఆమెనే అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్‌గా కొనసాగిస్తున్నారు. ఐదు కళాశాలలకు సంబంధించి కొత్త కోర్సుల విషయంలో విద్యావర్ధినితో తనిఖీలు చేయించారు. కొత్త అకడమిక్ ఇయర్ ప్రారంభం నేపథ్యంలో కళాశాలల అఫిలియేషన్ల కోసం ఆమెతోనే తనిఖీలు చేసేందుకు నిర్ణయించడం గమనార్హం.

అదేవిధంగా కనకయ్యను సైతం కొనసాగిస్తుండడం గమనార్హం. వీళ్లు విచ్చలవిడిగా నిధులు సైతం దుర్వినియోగం చేసిన ట్లు ఈసీ నిర్ణయించింది. సదరు దుర్వినియోగమైన నిధులను విద్యావర్ధిని, కనకయ్య, శివశంకర్‌ల నుంచి రికవరీ చేయాలని ఈసీ నిర్ణయించింది. ఇలాంటి నేపథ్యంలో విద్యావర్ధినినే అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్‌గా కొనసాగిస్తూ తనిఖీలు చేయిస్తుండడం పట్ల పలువురు విద్యార్థి సంఘాల బాధ్యులు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

■ తెలంగాణ వర్సిటీ వీసీతో పాటు విద్యావర్ధిని, కనకయ్య, శివశంకర్ చేసిన అవకతవకలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రికార్డులు స్వాధీనం చేసుకుని విచారణ చేస్తోంది. అయినప్పటికీ విద్యావర్ధినికి కీలక బాధ్యతలు కొనసాగిస్తుండడం అనుమానాలకు తావిస్తోంది. విద్యావర్ధిని ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా ఉన్న సమయంలో సెల్ఫ్ చెక్కుల ద్వారా తీసుకున్న ఖర్చుల వివరాలు చూస్తే విస్తుపోవాల్సిందే. కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీం పేరిట ఏకంగా రూ.11 లక్షలు డ్రా చేసుకోవడం విశేషం. విద్యావర్ధిని ఏకంగా మొత్తం రూ.15.21 లక్షలు డ్రా చేసు కోవడం గమనార్హం. ఇంకా అనేక విషయాలు వెలు గు చూస్తున్నాయి. ఈ నేపథ్యంలో సస్పెండ్ చేయకుండా ఇలా కొనసాగిస్తూ, కీలక బాధ్యతలు అప్పజెప్పడంపై రిజిస్ట్రార్ యాదగిరిని వివరణ కోరగా వారం రోజుల్లో కొత్త వీసీ వచ్చాక మార్పులు చేయడంతో పాటు సస్పెన్షన్ అమలు చేస్తామన్నారు. ప్రస్తుతం వీసీ లేకపోవడంతో సాంకేతికంగా కొన్ని ఇబ్బందుల నేపథ్యంలో విద్యావర్ధి నిని కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాకాటి కరుణను వివరణ కోరగా ప్రభుత్వ న్యాయవాది సలహా తీసు కుని ముందుకు వెళతామన్నారు. త్వరలో ప్రభు త్వం కొత్త వీసీని నియమిస్తుందన్నారు.

ఈ–నామ్ పనితీరు భేష్..



పంట ఉత్పత్తులను పరిశీలిస్తున్న జమ్మూకాశ్మీర్ అధికారులు

- జమ్మూకశ్మీర్ అధికారుల కితాబు
- నిజామాబాద్ మార్కెట్ సందర్శన

సుభాష్‌నగర్ : నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఈ–నామ్ అమలు తీరు బేషుగ్గా ఉందని జమ్మూకాశ్మీర్ ఉద్యాన, మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ వికాస్ శర్మ కితాబిచ్చారు. దేశంలోనే ఈ–నామ్ అమలులో ఉత్తమ మార్కెట్‌గా అవార్డు అందుకోవడం అభినందనీయమని ప్రశంసించారు. మంగళవారం మార్కెట్ కమిటీలో ఈ–నామ్ అమలు తీరును వికాస్ శర్మ ఆధ్వర్యంలో అధికారుల బృందం పరిశీలించింది. ఈ–నామ్ నిర్వహణను సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ వెంకటేశం, గ్రేడ్–2 సెక్రటరీ విజయ్‌కిషోర్ వివరించారు. పంట ఉత్పత్తులు, ఈ–నామ్ క్యాబిన్లు, గ్రేడింగ్ విధానం గురించి జమ్మూకాశ్మీర్ అధికారులు తెలుసుకున్నారు.

ట్రేడర్లు, అధికారులతో సమావేశం..

నిజామాబాద్ మార్కెట్ కమిటీలో ఈ–నామ్ పనితీరును పరిశీలించిన అనంతరం జమ్మూకాశ్మీర్ మార్కెటింగ్‌శాఖ అధికారులు ట్రేడర్లు, అధికారులతో సమావేశమయ్యారు. దళారులతో సంబంధం లేకుండా నేరుగా కాశ్మీర్ నుంచి బాస్మతి బియ్యం, యాపిల్ పండ్లు, కుంకుమ పువ్వు దిగుమతి చేసుకోవాలని సూచించారు. మార్కెటింగ్, రవాణా సౌకర్యం, తదితర సహాయసహకారాలు అందిస్తామని అధికారులు తెలిపారు. మంచి లాభాలు ఉంటాయని, అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని పేర్కొన్నారు. అనంతరం జమ్మూకాశ్మీర్ అధికారులను మార్కెట్ కమిటీ అధికారులు సన్మానించారు. జమ్మూకాశ్మీర్ మార్కెటింగ్‌శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అన్యత్ ఉల్లా ఖాంజీ, విజా అత్రి, మార్కెట్ కమిటీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో ఎవరైనా ముఖ్యమంత్రి కావొచ్చు

- పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : పార్టీ కోసం కష్టపడితే సాధారణ కార్యకర్త అయినా ముఖ్యమంత్రి అయ్యే అవకాశం ఒక్క కాంగ్రెస్ పార్టీలోనే ఉందని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన నిజామాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. చెప్పిన మాట మేరకు తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అన్నారు. తెలంగాణకు మొదటి ముఖ్యమంత్రి దళితుడినే చేస్తామని చెప్పిన కేసీఆర్ మాట తప్పారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ అధ్యక్షుడిగా దళితుడిని నియమించిందన్నారు. బీఆర్‌ఎస్‌లో మాత్రం ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్ష పదవి కేసీఆర్ చేతిలోనే అన్నారు. కాంగ్రెస్‌లో కష్టపడిన ప్రతి కార్యకర్తకు అందలం దక్కుతుందన్నారు. సీతక్క కావచ్చు, భట్టి విక్రమార్క, తాను, మరెవరైనా సీఎం అయ్యే అవకాశం కాంగ్రెస్ పార్టీలోనే సాధ్యమన్నారు. కేసీఆర్ పాలనకు ప్రజలు చరమగీతం పాడేందుకు సిద్ధం కావడంతో వాళ్ల కుటుంబంలో అలజడి నెలకొందన్నారు.

జిల్లాలో 23.5 మి.మీ. వర్షపాతం



సుభాష్‌నగర్: జిల్లావ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో 23.5 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా బెల్లాల్‌లో 63.3 మిల్లీ మీటర్లు, బోధన్‌లో 44.0, మోర్తాడ్‌లో 42.0, నిజామాబాద్ నార్త్ లో 39, ఎడపల్లిలో 38, ముప్కాల్‌లో 33 మిలీమీటర్ల వర్షం కురిసింది. వానాకాలం సీజన్ ప్రారంభమై 40 రోజులు గడిచిన తర్వాత మొదటిసారిగా అత్యధిక వర్షపాతం నమోదైంది. రాగల రెండ్రోజులు కూడా జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు నమోదయ్యే అవకాశముందని వాతావరణశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఈ సీజన్‌లో జిల్లాలో మూడు మండలాల్లో సాధారణ వర్షపాతం, మిగతా మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. సోమవారం రాత్రి కురిసిన వర్షంతో రైతన్నలు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

నమోదైన వర్షపాతం (మి.మీ.లలో)					
		చందూరు	29.3	నందిపేట	14.0
బోధన్	44.0	మెండోరా	22.9	డొంకేశ్వర్	15.5
మోర్తాడ్	42.0	బాల్కొండ	20.9	ఆలూరు	17.0
ఎడపల్లి	38.0	వర్ని	20.6	రుద్రూరు	18.6
నిజామాబాద్ నార్త్	39.0	పోతంగల్	20.8	రెంజల్	16.0
ముప్కాల్	33.0	సాలూర	25.0	నవీపేట	19.5
మోస్రా	31.0	కమ్మర్‌పల్లి	31.5	నిజామాబాద్‌రూరల్	13.0
ఏర్గట్ల	30.1	భీమ్‌గల్	23.5	ఆర్మూర్	14.2
మాక్లూర్	29.9	నిజామాబాద్‌సౌత్	22.8	జక్రాన్‌పల్లి	15.6
డిచ్‌పల్లి	28.1	మోపాల్	22.9		

దళితుల అభ్యున్నతికి సీఎం కృషి

- దశలవారీగా దళితబంధు అమలు
- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే బిగాల, ఉన్నత విద్యామండలి చైర్మన్ లింబాద్రి

నిజామాబాద్‌నాగారం: దళితుల అభ్యున్నతి కోసం మనసు పెట్టి పని చేసే వ్యక్తి ముఖ్యమంత్రి కేసీఆర్ అని రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం నిజామాబాద్ నగరంలోని న్యూ అంబేడ్కర్ భవన్‌లో డాక్టర్ బాబు జగ్జీవన్‌రాం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో దళితరత్న అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి హాజరై మాట్లాడారు. ప్రతి దళిత కుటుంబం పైకి రావాలని రాష్ట్రంలో దళిత బంధు పథకాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. దళితులందరికీ దశల వారీగా దళిత బంధు అమలు అందజేస్తామన్నారు. సీఎం కేసీఆర్ విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారన్నారు. మారుమూల ప్రాంతాల వారు ఉన్నత విద్యను అభ్యసించాలనే సంకల్పంతో కొత్తగా 85 మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. తన మండలానికి చెందిన ప్రొఫెసర్ లింబాద్రి చదువులో తన కన్నా రెండేళ్లు సీనియరని మంత్రి గుర్తు చేశారు. ఎన్నో కష్టాలు, బాధలు ఎదుర్కొని అంచెలంచెలుగా ఆయన ఉన్నత విద్యా మండలి చైర్మన్ స్థాయికి ఎదిగారన్నారు. దళితులు అందరు లింబాద్రిని ఆదర్శంగా తీసుకోని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. అంబేడ్కర్ విగ్రహాన్ని నిర్మించే బాధ్యతలు తనకు దక్కడాన్ని పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని మంత్రి భావోద్వేగానికి లోనయ్యారు. కేసీఆర్ ఆలోచనలకు అనుగుణంగా విగ్రహం కట్టిస్తున్న సమయంలో తాను అనిర్వచనీయమైన అనుభూతికి లోనయ్యానని చెప్పారు.

చదువుతోనే ఎదుగుతాం

ఎన్ని కష్టాలు ఎదురైనా పిల్లల భవిష్యత్ కోసం వారు ఉన్నత విద్య అభ్యసించేలా ప్రోత్సహించాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ లింబాద్రి సూచించారు. ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తూ అనేక చర్యలు చేపడుతోందన్నారు. చదువునే ఉన్నతంగా ఎదుగుతామని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా మాట్లాడుతూ ప్రభుత్వం దళితలకు అండగా ఉండి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. ఈ సందర్భంగా దళితుల అభ్యున్నతికి విశేషంగా కృషి చేసిన 30 మందికి దళితరత్న అవార్డులు ప్రదానం చేశారు. జిల్లాకు చెందిన రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆర్ లింబాద్రిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మేయర్ నీతూ కిరణ్, మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్, బాబు జగ్జీవన్ రామ్, అంబేడ్కర్ జయంతి ఉత్సవాల కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం పాపయ్య, దళిత సంఘాల ప్రతినిధులు నాంపల్లి, బాబురావు, విద్యాసాగర్, శ్రీనివాస్, గైని గంగారం, విద్యావేత్త మారయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలు ఎప్పుడిస్తరు!

- అధికారులపై లబ్ధిదారుల ఒత్తిడి
- డీడీలు కట్టి పది నెలలవుతోందని ఆవేదన
- దశాబ్ది ఉత్సవాల్లో ఇచ్చింది 85 యూనిట్లే

డొంకేశ్వర్/మోర్తాడ్: రాయితీపై అందజేస్తున్న రెండో విడత గొర్రెల పంపిణీ ప్రక్రియలో తీవ్ర జాప్యం నెలకొంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాకపోవడంతో లబ్ధిదారులకు సమయానికి జీవాలు అందడం లేదు. దీంతో డీడీలు కట్టి నెలల తరబడి ఎదురుచూస్తున్న వారిలో నిరాశ, అసంతృప్తి నెలకొంది. ఈ క్రమంలో గొర్రెలు ఎప్పుడిస్తరని పశుసంవర్ధక శాఖ అధికారులపై ఒత్తిడి పెంచుతున్నారు. అధికారులు కూడా త్వరలో వస్తాయని చెప్పడం తప్పా, మరేం చేయడం లేదు. ఇటీవల జరిగిన తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో గొర్రెల పంపిణీని ప్రారంభించిన ప్రభుత్వం జిల్లాలో కేవలం 85 యూనిట్లను మాత్రమే గొల్ల,కుర్మలకు అందజేసింది. ఉత్సవాలు ముగిసి దాదాపు 20 రోజులవుతున్నా మళ్లీ ఇంత వరకు ఒక్క గొర్రెను కూడా అందజేయలేదు. డీడీలు కట్టిన వారికే నెలలు గడుస్తున్నా జీవాలు రాకపోవడంతో కొత్తగా డీడీలు కట్టేందుకు గొల్లకుర్మలు ముందుకు రావడం లేదు.

ఇప్పటి వరకు 1,868 డీడీలు

రెండో విడత గొర్రెలు పంపిణీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు 8,384 యూనిట్ల లక్ష్యాన్ని నిర్దేశించింది. ఇప్పటి వరకు 1,868 మంది డీడీలు కట్టారు. ఒక్క యూనిట్ విలువ రూ.1.75లక్షలు ఉండగా, లబ్ధిదారుల నుంచి రూ.43,750 వాటాధనాన్ని ప్రభుత్వం సేకరిస్తోంది. ఇప్పటి వరకు 85 యూనిట్ల గొర్రెలను పంపిణీ చేశారు. ఇటీవల బోధన్ మండలం నందిగామకు చెందిన 35 లబ్ధిదారులు గొర్రెల కోసం అనంతపూర్ జిల్లాకు వెళ్లి సరైన జీవాలు లేకపోవడంతో వాపస్ వచ్చారు. వీరిని ఈ వారంలో మళ్లీ పంపించడానికి అధికారులు చర్యలు చేపడుతున్నారు. డీడీ కట్టి మిగిలినపోయిన 1,833 మందిని ప్రభుత్వ ఆదేశాల ప్రకారం విడతల వారీగా అనంతపూర్, రాయచూర్ జిల్లాలకు పంపనున్నారు. ఇందుకోసం డీడీలు కట్టిన వారీలో సీనియార్టీ జాబితాను రూపొందిస్తున్నారు.

■ ఈ ఫొటోలో కనిపిస్తుంది డొంకేశ్వర్ మండలం నికాల్‌పూర్ గ్రామానికి చెందిన వారు. అధికారులు ఒత్తిడి చేయడంతో గతేడాది సెప్టెంబర్‌లో గొర్రెల కోసం ప్రభుత్వానికి 23 మంది డీడీలు కట్టారు. ఇందులో అప్పులు చేసి కట్టిన వారు కూడా ఉన్నారు. డీడీలు కట్టిన కొన్ని రోజులకే జీవాలు అందిస్తామని అధికారులు చెప్పారని.. కానీ పది నెలలవుతున్నా ఇంత వరకు గొర్రెలను పంపిణీ చేయలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గొర్రెలైనా ఇవ్వండి లేదా కట్టిన డబ్బులైనా తిరిగివ్వాలని డిమాండ్ చేస్తున్నారు.



స్థానిక అంగళ్లకు తీసుకెళ్లాలి



డీడీలు కడితే పదిహేను రోజుల్లో గొర్రెలిస్తామని చెప్పిండ్రు. పది నెలలైతుంది, ఇంత వరకు ఇయ్యలేదు. డీడీలు కట్టిన వారిని ఎక్కడో వేరే రాష్ట్రాలకు తీసుకెళ్లే బదులు మన దగ్గరే ఉన్న స్థానిక అంగళ్లకు తీసుకెళ్తే త్వరగా జీవాలను పంపిణీ చేయడానికి వీలుంటుంది.
– ప్రశాంత్, నికాల్‌పూర్, డొంకేశ్వర్ మండలం

ఆందోళన చెందొద్దు

గొర్రెల పంపిణీ ఆలస్యమైతుందని గొల్ల,కుర్మ, యాదవులు ఎలాంటి ఆందోళన చెందవద్దు. సీనియారిటీ ప్రకారం ప్రభుత్వ ఆదేశానుసారం డీడీలు కట్టిన వారందరికీ జీవాలను అందజేస్తాం. గొర్రెలను తేవడానికి విడతల వారీగా తీసుకెళ్తాం. ఈ వారంలో కొంతమందిని పంపనున్నాం. – జగన్నాథచారి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి

సా..గుతోంది!

- నెమ్మదించిన వర్షాకాల పంటలు
- 25 శాతం కూడా మించని వరినాట్లు
- నగమే సాగైన మక్క, సోయా
- వర్షాభావ పరిస్థితులే కారణమంటున్న రైతులు



నికాల్‌పూర్ శివారులో వరినాట్లు వేస్తున్న కూలీలు



నూత్‌పల్లిలో పొలాన్ని దమ్ము చేస్తున్న రైతు

డొంకేశ్వర్(ఆర్మూర్): వర్షాభావ పరిస్థితులు పంటల సాగుపై ప్రభావం చూపుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ప్రధాన పంటలు కలిపి ఇప్పటి వరకు 40 శాతం కూడా సాగవలేదు. వరి, మొక్కజొన్న, సోయా పూర్తిగా నెమ్మదించాయి. దీంతో వ్యవసాయ శాఖ వేసిన అంచనాలు తలకిందులయ్యాయి. తొలకరి జల్లులే తప్పా భారీ వానలు కురవకపోవడంతో పంటలు సాగు చేసేందుకు రైతులు సాహసించడం లేదు. ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో 5,13,355 ఎకరాల్లో పంటలు సాగవుతాయని అధికారులు అంచనా వేయగా, వర్షాకాలం ప్రారంభమై నెలన్నర కావస్తున్నా కేవలం 1,79,828 ఎకరాల్లో పంటలు వేశారు. ఇందులో వరిపంట 4.17లక్షల ఎకరాలకు మంచి సాగవుతుందని అంచనా ఉంటే ఇప్పటి వరకు 79,918 ఎకరాల్లో మాత్రమే సాగైంది. ఈ నెల మొదటి వారంలో కురిసిన ఒకటి, రెండు వర్షాలతో ఏకంగా 50వేల ఎకరాల దాకా వరినాట్లు పడ్డాయి. కానీ ప్రస్తుతం రెండో వారం పూర్తి కావస్తున్న నేపథ్యంలో కేవలం 6,351 ఎకరాల్లో మాత్రమే నాట్లు పడడం గమనించాల్సిన విషయం. వర్షాలు లేకపోవడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని అన్నదాతలు పేర్కొంటున్నారు. అదే విధంగా మక్క, సోయా పంటల పరిస్థితి కూడా అంతే ఉంది. అంచనాలో సగం మట్టుకే సాగైంది.

బోధన్ డివిజన్‌లోనే అత్యధికం..

జిల్లాలో వరిపంట సాగు ఇప్పటికే సగానికి చేరుకోవాల్సి ఉండగా, పావుశాతం కూడా దాటలేదు. సాగైన పంటలో బోధన్, బాన్సువాడ ప్రాంతాల్లోనే నాట్లు పడ్డాయి. బోర్లు ఉన్నాయనే ధైర్యంతో నిజామాబాద్, ఆర్మూర్ డివిజన్‌లోని రైతులు ఇప్పుడిప్పుడే నాట్లు మొదలు పెట్టారు. భీమ్‌గల్‌లో నాట్లు ఆలస్యం కానున్నాయి. మక్క, సోయా, పత్తి పంటలు కూడా పూర్తి స్థాయిలో వేయలేదు. ప్రాజెక్టుల్లో నీరు లేకపోవడం, వర్షాలు లేకపోవడంతో ఆయకట్టు కింద రైతులు పంటలు వేయడానికి ముందుకు రావడం లేదు. ఈ నెలాఖరు వరకు వర్షాలు పడకపోతే సాగు విస్తీర్ణం తగ్గే అవకాశాలున్నాయి.

ఇప్పటి వరకు సాగైన పంటలు (ఎకరాల్లో)		
పంట	అంచనా	సాగైంది
వరి	4,17,943	79,918
మొక్కజొన్న	32,185	25,023
సోయా	58,714	37,279
కంది	1,883	217
పెసర	151	12
మినుములు	125	10
వేరుశనగ	204	0
పత్తి	1,803	1,327

క్లుప్తంగా

నేడు విద్యాసంస్థల బంద్

నిజామాబాద్అర్బన్: నేడు జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు వామపక్ష విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయి. కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో వారు బంద్‌కు పిలుపునిచ్చారు.

తుల్జాపూర్ భవానీమాతకు ప్రత్యేక పూజలు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: తెలంగాణ పీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్ హందాన్ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకులు మంగళవారం మహారాష్ట్రలోని తుల్జాపూర్ భవానీమాత ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా కిసాన్ ఖేత్ అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి, మీసాల సుధాకర్‌రావు, భక్తవత్సలం, కిక్ గంగారెడ్డి, ఆక్ల సాయిరెడ్డి, కాలూరు భోజన్న ఉన్నారు.

పోలీసులకు సేవా పతకాలు

నిజామాబాద్ నాగారం: తెలంగాణ ప్రభుత్వం పోలీసు విభాగాల్లో బాగా పనిచేసిన వారికి సేవాపతకాలు ప్రకటించింది. జిల్లాలో పలు విభాగాల్లో సేవా పతకాలు పొందిన వారి వివరాలు ఇలా ఉన్నాయి. డీఎస్పీ (సివిల్) మధుసూదన్‌రావు,ఆర్ఎస్సై కె.సదానంద్, ఎస్సైలు జి.రాజు, ఎస్ సత్యప్రసాద్, 4వ టౌన్ ఏఎస్సై ఖాన్‌మహ్మమద్, 3వ టౌన్ ఏఎస్సై ఎంఏ అబ్దుల్‌వాహబ్, ఏఆర్ఎస్సై సీహెచ్ ముక్తేశ్వరరావు, మెండోరా ఏఎస్సై సీహెచ్ మురళీధర్‌రాజు, ఏఆర్ఎస్సైలు వి నాగసత్యనారాయణ, గుండ్రపు లింగన్న, కె.లక్ష్మన్‌రావు, హెడ్‌కానిస్టేబుల్ అజ్మీర శంకర్, ఇందల్వాయి హెడ్‌కానిస్టేబుల్ డి కిషన్ , రెంజల్ హెడ్‌కానిస్టేబుల్ డి.ప్రభాకర్, ఏఆర్‌హెచ్‌సీ వి ముత్యన్న, రుద్రూర్ హెడ్‌కానిస్టేబుల్ కె విఠల్, హెడ్‌కానిస్టేబుల్ పి మోహన్‌గౌత్రక్, 4వ టౌన్ కానిస్టేబుల్ కె రేణుక ఉన్నారు. ఇంటలిజెన్స్ విభాగంలో పి సదానంద్, అగ్నిమాపక దళ విభాగంలో ఆర్మూర్‌కు చెందిన ఫైర్‌మన్ ఎం అనంతరావు. మద్నూర్‌కు చెందిన పి వినోద్‌కుమార్ ఉన్నారు.

ప్రశాంతంగా డిగ్రీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో మంగళవారం ప్రారంభమైన డిగ్రీ 6వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ అరుణ తెలిపారు. ఈ పరీక్షల్లో 3158 మంది విద్యార్థులకుగాను, 2744 మంది హాజరైనట్లు ఆమె తెలిపారు.

స్కీం పేరుతో స్కాం

- లక్కీడ్రాలో బహుమతులంటూ నిర్వాహకుల ప్రచారం
- వేలసంఖ్యలో చేరిన సభ్యులు
- కాలపరిమితి ముగిసినా బహుమతులు ఇవ్వని నిర్వాహకులు



మోర్తాడ్(బాల్కొండ): మా స్కీంలో చేరితే లక్కీ డ్రా ద్వారా కారు, ట్రాక్టర్, మోటార్ సైకిల్, ఫ్రిజ్, టీవీ మరెన్నో బహుమతులను గెలుచుకునే అవకాశం ఉందంటూ నిర్వాహకులు ప్రచారం నిర్వహించి, వేల సంఖ్యలో సభ్యులను చేర్చుకున్నారు. ప్రస్తుతం స్కీం కాలపరిమితి ముగిసి ఏడాదిన్నర కావస్తున్నా, లక్కీడ్రాలో గెలిచినవారికి బహుమతులను పంపిణీ చేయలేదు. దీంతో స్కీంలో చేరిన సభ్యులు నిండా మునగడంతో, ఆవేదన చెందుతున్నారు. ఇదంతా మోర్తాడ్ మండలం దొన్కల్ కేంద్రంగా సాగిన ఓ లక్కీడ్రా నిర్వాహకుల తతంగం.

రూ.3.50 కోట్లు వసూలు..

2020లో స్కీం ప్రారంభించగా 16 నెలల కాలపరిమితితో 2021లో ముగిసిపోయింది. దాదాపు 3వేల మందిని సభ్యులతో స్కీంను కొనసాగించారు. ఒక్కో సభ్యుడు నెలకు రూ.వెయ్యి చొప్పున, 16 నెలల పాటు రూ.16వేలు చెల్లించాడు. ప్రతి నెలా లక్కీ డ్రా నిర్వహించగా గెలిచినవారు మాత్రమే పూర్తిస్థాయిలో సొమ్ము చెల్లించలేదు. మెజార్టీ సభ్యులు మొత్తం నెలల పాటు డబ్బులను చెల్లించారు. ఈ స్కీం నిర్వహణతో దాదాపు రూ.3.50 కోట్ల వరకు వసూలు చేశారు. పక్కాగా బహుమతులను పంపిణీ చేసినా నిర్వాహకులకు రూ.1కోటి వరకు మిగులుతుంది. 1,500ల మందికి డ్రాలో గెలుపొందిన విధంగా బహుమతులను అందించిన స్కీం నిర్వాహకులు మిగిలిన 1,500ల మందికి చేతులెత్తివేశారు. ప్రస్తుతం స్కీం నిర్వాహకుల చుట్టూ తమ బహుమతుల కోసం సభ్యులు చెప్పులు అరిగేలా తిరుగుతూనే ఉన్నారు. అయినప్పటికీ డ్రాలో గెలిచినవారికి బహుమతులు ఇవ్వకుండా కనీసం వారికి డబ్బులు వాపసు ఇవ్వకుండా వేధిస్తూనే ఉన్నారు.

మంత్రి వద్దకు పంచాయితీ..

స్కీం నిర్వాహకులు వసూలు చేసిన సొమ్మును రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడి పెట్టి సభ్యులకు మాత్రం చుక్కలు చూపుతున్నారు. సొమ్మును తమ సొంత వ్యాపారాలకు మళ్లించడంతో సభ్యులకు మొండిచేయి చూపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిర్వాహకుల్లో ఇద్దరు అధికార బీఆర్ఎస్ పార్టీకి చెందినవారు ఉన్నారు. వీరు డబ్బులను రియల్ ఎస్టేట్‌కు మళ్లించగా విభేదాలు వచ్చాయి. ఈ పంచాయతీని ఎలాగైనా పరిష్కరించాలని ఒక నాయకుడు మంత్రి ప్రశాంత్‌రెడ్డి వద్ద మొరపెట్టుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. స్కీం పేరుతో చేసిన దగా వల్ల పార్టీకి చెడ్డపేరు వస్తుందని, మంత్రి సీరియస్‌గా వార్నింగ్ ఇచ్చినట్లు తెలుస్తుంది. కానీ నిధులను పక్కదారి పట్టించిన నాయకులలో ఒకరు మాత్రం ఎలాంటి స్పందన లేకుండా ఉండటంతో ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందోనని అటు సామాన్య ప్రజలు, ఇటు బీఆర్ఎస్ నాయకులు ఆసక్తికరంగా చర్చించుకుంటున్నారు.

పక్కాగా విచారణ జరిపించాలి

లక్కీడ్రాల పేరుతో స్కీంలను నిర్వహించి, అమాయకులైన ప్రజల నుంచి విచ్చలవిడిగా డబ్బులు వసూలు చేసిన నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఈఅంశంపై పక్కాగా విచారణ జరిపించాలి. అక్రమాలకు పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలి.

–ముత్యాల రాములు,
కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మోర్తాడ్

శాస్త్రీయ పరిష్కారాలతో ప్రాజెక్టులు రూపొందించాలి



మాట్లాడుతున్న జిల్లా సైన్స్ అధికారి గంగాకిషన్

పెర్కిట్(ఆర్మూర్): ఇన్‌స్పైర్ అవార్డ్స్ నామినేషన్లకు విద్యార్థులు రూపొందించే ప్రాజెక్టులు శాస్త్రీయ పరిష్కారాలు కలిగి ఉండేవిధంగా ఉండాలని జిల్లా సైన్స్ అధికారి గంగాకిషన్ సూచించారు. పెర్కిట్ మోడల్ స్కూల్‌లో మంగళవారం ఇన్‌స్పైర్ అవార్డ్స్ నామినేషన్లపై డివిజన్‌లోని సైన్స్ ఉపాధ్యాయులకు ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గంగాకిషన్ మాట్లాడుతూ.. ఈ నెల 25లోగా ప్రతి ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి ఐదు ప్రాజెక్టులను అప్‌లోడ్ చేయాలని సూచించారు. అలాగే ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సైతం నామినేషన్లను తప్పనిసరిగా పూర్తి చేయాలని సూచించారు. అలాగే విద్యార్థులతో జాతీయ బ్యాంకులలో ఖాతాలు తెరిపించాలన్నారు. రిసోర్స్ పర్సన్స్ శ్రవణ్, శ్రీనివాస్, లక్ష్మణ్, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, టీచర్లు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి

ఖలీల్‌వాడి: తోటి విద్యార్థులను వేధింపులకు గురిచేయడం, ర్యాగింగ్‌కు పాల్పడటం చట్టరీత్యా నేరమని, మానసిక, శారీరక హింసకు పాల్పడితే కఠిన శిక్షలు ఉంటాయని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి తెలిపారు. నగరంలోని ఎస్ఎస్ఆర్ కళాశాలలో మంగళవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. విద్యార్థులు ర్యాగింగ్‌కు అలవాటు పడితే వారి భవిష్యత్ అంధకారమవుతుందని వివరించారు. న్యాయసేవ సంస్థ చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ రాజ్‌కుమార్ సుబేదార్, నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఆశానారాయణ మాట్లాడుతూ.. విద్య విద్యార్థులను విజ్ఞానవంతులను చేస్తే ,ర్యాగింగ్ అధోగతి పాలుచేస్తుందని వివరించారు. ప్రిన్సిపాల్ రవీందర్ గౌడ్, లెక్చరర్లు పాల్గొన్నారు.

మంచిప్ప అడవిలో ఎలుగుబంటి సంచారం!

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని మంచిప్ప అటవీ ప్రాంతం శివారులో ఎలుగుబంటి సంచరిస్తోందని, ఇటీవ పంట పొలాల వైపు వెళ్లిన రైతులకు కనిపించిందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఈవిషయం గ్రామస్తులకు తెలియడంతో మంచిప్పతోపాటు శివారు గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారమందించారు. వారు ఎలుగుబంటి సంచరించిన ప్రాంతాలను పరిశీలించారు. పాదముద్రలను సేకరించారు. ఎలుగుబంటి గ్రామాలకు రాకుండా అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

యూపీ వ్యవసాయ కూలీ అదృశ్యం

నిజామాబాద్ సిటీ: ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ కూలీ పనిచేసేందుకు వచ్చి అదృశ్యమైనట్లు నిజామాబాద్ రూరల్ ఎస్సైలింబాద్రి మంగళవారం తెలిపారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన 40 మంది వ్యవసాయ కూలీలు జూన్ 28న రూరల్ మండలం తిర్మన్‌పల్లి గ్రామానికి వచ్చారు. వారిలో చత్రపాల్ అనే కూలీ ఈ నెల 7నుంచి కనిపించకుండపోయాడు. తోటి కూలీలు ఎంత వెతికినా అతడి ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో చత్రపాల్ సోదరుడి కొడుకు రామ్‌చరణ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోడు పట్టాల్లో లోటుపాట్లు సరిచేయాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జగన్, నాయకులు

సుభాష్‌నగర్: నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని వివిధ మండలాల్లోగల పోడు భూముల పట్టాలలో లోటుపాట్లు జరిగాయని, వాటిని వెంటనే సరిచేయాలని ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి నాగూరావుతో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులతో సమావేశం నిర్వహించారు. పోడు భూముల అటవీహక్కు పట్టాలలో జరిగిన లోపాలను జగన్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా జగన్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో చాలామంది లబ్ధిదారులకు పోడు పట్టాలు ఇంకా రావాల్సి ఉందన్నారు. ఇచ్చిన హక్కు పట్టాల్లో కూడా చాలా వరకు సాంకేతిక లోపాలు ఉన్నాయని, వీలైనంత త్వరగా వాటిని సరిచేయాలని కోరారు. అలాగే మిగిలిపోయిన లబ్ధిదారులకు కూడా పోడు పట్టాలు త్వరగా పంపిణీ చేయాలన్నారు. స్పందించిన అదనపు కలెక్టర్ త్వరలోనే ప్రజాప్రతినిధులు, గిరిజన నాయకులతో గ్రామ, డివిజన్, జిల్లాస్థాయిలో మరోసారి సమావేశాన్ని ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరిస్తామని హామీనిచ్చారు. ప్రజాప్రతినిధులు, నాయకులు రమేష్ నాయక్, మాన్‌సింగ్, రాజేందర్, ప్రేమ్ నాయక్, లక్ష్మీనారాయణ, నరేష్, గోపాల్‌రెడ్డి, చింత శ్రీనివాస్‌రెడ్డి, కోర్వ దేవేందర్, తిరుమల్, అంబర్‌సింగ్ రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయంలో అపచారం

- ఆలయం వద్ద మాంసం ముక్కలు
- పోలీసుల అదుపులో నిందితుడు



ఎస్సైకి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రానికి సమీపంలోని బారడి పోచమ్మ ఆలయంలో సోమవారం రాత్రి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు మాంసం, ఎముకలు పెట్టి అపచారం చేశారని గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఉదయం ఆలయానికి వెళ్లిన కొందరు భక్తులు వాటిని గమనించడంతో, గ్రామపెద్దలు గ్రామంలో ర్యాలీ తీసి పోలీస్ స్టేషన్‌లో ఎస్సై కృష్ణారెడ్డికి ఫిర్యాదు చేశారు. కాగా అక్కడ మద్నూర్‌కు చెందిన షేక్ అతీఫ్ ఆధార్‌కార్డు జిరాక్స్ ఉండడంతో అతడిని పట్టుకొని చర్యలు తీసుకోవాలని వారు ఎస్సైతో పేర్కొన్నారు.

అక్రమ కేసులో ఇరికించాలనే..

డోంగ్లీ మండల కేంద్రానికి చెందిన షాదుల్ సోమవారం రాత్రి బారడి పోచమ్మ ఆలయం ముందు మాంసం, ఎముకలు పెట్టినట్లు తెలిందని ఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు. షాదుల్, మద్నూర్‌కు చెందిన అతీఫ్ ఇద్దరు బావబావమరుదులని, ఇద్దరి మధ్య కొన్ని నెలలుగా తగాదాలు కొనసాగుతున్నాయన్నారు. అతీఫ్‌ను అక్రమ కేసులో ఇరికించాలనే షాదుల్ ప్లాన్ వేసి సోమవారం రాత్రి బారడిపోచమ్మ ఆలయానికి వచ్చి మాంసం, ఎముకలు, తన వద్ద ఉన్న అతీఫ్ ఆధార్‌కార్డు జిరాక్స్ పెట్టి వెళ్లిపోయాడన్నారు. షాదుల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామన్నారు.

తాళంవేసిన రెండిళ్లల్లో చోరీ

- 19.5 తులాల బంగారం, రూ. లక్షల నగదు అపహరణ



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

బోధన్‌టౌన్(బోధన్): బోధన్‌లోని గౌడ్స్ కాలనీతో పాటు సరస్వతి నగర్ కాలనీలోని తాళం వేసిన రెండిళ్లలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇళ్ల తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. పట్టణ ఎస్‌ఐ పీటర్ తెలిపిన వివరాలు ఇలా.. పట్టణంలోని గౌడ్స్ కాలనీలో నివాసం ఉంటు మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న రఫీ తన కుటుంబ సభ్యులతో సోమవారం సిద్దిపేట్‌లోని బంధువుల ఇంటికి వెళ్లి, మంగళవారం తెల్లవారుజామున తిరిగివచ్చారు. ఇంటి తాళం పగులగొట్టి ఉండడంతో ఇంట్లోకి వెళ్లి చూడగా, బీరువాలో దాచిన 12 తులాల బంగారం, రూ. ఒక లక్ష 28వేల నగదును దుండగులు చోరీ చేశారు. పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించడంతో పాటు క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు.

సరస్వతి నగర్ కాలనీలో...

పట్టణంలోని సరస్వతీ నగర్ కాలనీలో నివాసం ఉంటున్న గోషిక రాజ తన కుటుంబసభ్యులతో ఐదు రోజుల క్రితం తీర్థయాత్రలకు వెళ్లారు. అతడి బావమరిది సురేష్ ఐదురోజులుగా రాత్రిళ్లు రాజ ఇంట్లోనే పడుకునేవాడు. సోమవారం రాత్రి వర్షం పడడంతో రాలేదు. మరుసటి రోజు ఉదయం రాజ ఇంటికి వెళ్లగా ఇంటికి రాగా ఇంటి తాళం పగులగొట్టి ఉండటంతో ఇంట్లోకి వెళ్లి చూశాడు. బీరువాలో ఉన్న ఏడున్నర తులాల బంగారంతో పాటు రూ. 50వేల నగదును దుండగులు చోరీ చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు.

కేజ్‌వీల్ ట్రాక్టర్ల సీజ్...



మోర్తాడ్: రోడ్లపై నడుపుతున్న మూడు కేజ్‌వీల్స్ ట్రాక్టర్లను మోర్తాడ్ పోలీసులు మంగళవారం సీజ్ చేశారు. తిమ్మాపూర్ మార్గంలో కేజ్‌వీల్స్ ఉన్న ట్రాక్టర్లు ఆర్అండ్‌బీ రోడ్డుపై తిరుగుతుండటంతో రోడ్లు ధ్వంసం అవుతున్నాయనే ఉద్దేశ్యంతో వీటిని సీజ్ చేశారు. ట్రాక్టర్లను తగిన ఏర్పాట్లు చేసుకుని తిప్పాలని ఎస్సై ముత్యంరాజు సూచించారు. నిబంధనలను పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

సిరికొండ మండలంలో..

సిరికొండ: మండలంలోని తూంపల్లి గ్రామ పరిధిలో తారు రోడ్డును ధ్వంసం చేసిన కేజ్‌వీల్స్ ట్రాక్టర్‌ను పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్సై నర్సింలు తెలిపారు. సోమవారం తూంపల్లి నుంచి పాకాల మార్గంలో పెట్రోలింగ్ చేస్తుండగా తూంపల్లి గ్రామానికి చెందిన జింక అజయ్ కేజ్‌వీల్ ట్రాక్టర్‌ను తారు రోడ్డుపై నడుపుతున్నాడన్నారు. దీంతో ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించామని, యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



ధర్పల్లి మండలంలో..



ధర్పల్లి: మండలంలోని రామడుగు గ్రామ శివారులో రహదారిపై తిరుగుతున్న కేజ్‌వీల్ ట్రాక్టర్‌ను మంగళవారం పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసి, ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కోతుల దాడిలో ఒకరికి తీవ్ర గాయాలు



గాయపడ్డ భైరయ్య

రామారెడ్డి: మండల కేంద్రంలో కోతుల మంద ఒక్కసారిగా దాడి చేయడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డ ఘటన మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. రామారెడ్డి గ్రామానికి చెందిన నామాల భైరయ్య(45) ఇంట్లోకి వెళుతుండగా ఒక్కసారిగా కోతుల గుంపు భైరయ్యపై పడి దాడి చేసి గాయపరిచాయి. వెంటనే స్థానికులు వచ్చి కోతులను తరమడంతో ప్రాణాపాయం తప్పింది. గాయపడ్డ భైరయ్యను కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మార్చిలో నర్సవ్వ అనే వృద్ధురాలు కోతుల దాడిలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మరువకముందే మరోసారి కోతుల మంద వ్యక్తిపై దాడి చేయడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. కోతుల గుంపును గ్రామం నుంచి తరిమేయాలని, తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

హోటల్ యజమానిపై కేసు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): హోటల్‌లో బాలుడితో పనిచేయిస్తున్న యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తోట రాజేశ్ మంగళవారం తెలిపారు. మండలంలోని పద్మాజీవాడి చౌరస్తా వద్ద గల హోటళ్లను ఎస్సై తోట రాజేశ్ ఆధ్వర్యంలో ఆపరేషన్ ముస్కాన్ టీం తనిఖీలు చేశారు. ఓ హోటల్‌లో పని చేస్తున్న బాలుడిని గుర్తించి హోటల్ నిర్వాహకుడు సయ్యద్ పత్తాపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

డ్రంకన్‌డ్రైవ్ కేసులో ఒకరికి జైలు

మాచారెడ్డి: డ్రంకన్ డ్రైవ్ కేసులో ఒకరికి కామారెడ్డి సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ ప్రతాప్ రెండు రోజుల జైలు శిక్షతో పాటు రూ 200 జరిమానా విధించినట్లు మాచారెడ్డి ఎస్సై రాజా రమేష్ మంగళవారం తెలిపారు. మండలంలోని బండ రామేశ్వరపల్లి గ్రామానికి చెందిన అంబాల రమేష్‌పై మూడు నెలల కిందట డ్రంకన్‌డ్రైవ్ కేసు నమోదు కాగా మంగళవారం కోర్టులో హాజరు పర్చగా జడ్జి శిక్ష విధించినట్లు ఎస్సై వివరించారు.

భవనం పైనుంచి పడి కూలీ మృత్యువాత



మృతిచెందిన షేక్ రహీం

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గంగాస్థాన్ 1లో కొత్తగా నిర్మిస్తున్న ఓ అపార్టుమెంట్‌లో కూలి పనిచేస్తున్న షేక్ రహీం(33) ప్రమాదవశాత్తు కిందపడి మృతిచెందినట్లు ఎస్సై లింబాద్రి మంగళవారం తెలిపారు. మహారాష్ట్ర దెగ్లూర్‌కు చెందిన షేక్ రహీం అపార్టుమెంట్ పై అంతస్తులో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతిచెందాడు. మృతుడి తండ్రి షేక్ మెయిన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ పలువురి మృతి



నరేష్ (ఫైల్)

మాచారెడ్డి: ప్రమాదవశాత్తు మంటల్లో పడి తీవ్రంగా గాయపడిన ఓ యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా.. పాల్వంచ మండల కేంద్రానికి చెందిన తోట నరేష్(33) సోమవారం ఇంటి ముందు వేసిన పందిరి పబ్బు (కొమ్మలు) తగలబెడుతుండగా ప్రమాదవశాత్తు మంటల్లో పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం కామారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గ్రామస్తులు వివరించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

భిక్కనూరు మండలంలో వివాహిత..

భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో ఆత్మహత్యకు యత్నించిన ఓ వివాహిత ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసుల తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన దివ్య (22) సోమవారం కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించింది. తీవ్రంగా గాయపడిన దివ్యను స్థానికులు కామారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఉస్మానియ ఆస్పత్రికి తరలించగా, మార్గమధ్యలోనే మృతి చెందిందని అక్కడివె వైద్యులు తెలిపారు. ఇదిలా ఉండగా దివ్యకు వేరే వ్యక్తితో వివాహేతర సంబంధం ఉందని ఆమె భర్త రమేశ్, నడిపి మామ బాలయ్య, బావ బాల్‌రాజులు తరచు వేధించేవారని, ఈ విషయం తమకు చెబుతు తరుచు బాధపడేదని దివ్య సోదరుడు పరుశరాంలు పోలీసులకు పిర్యాదు చేశాడు. తమ సోదరి మృతికి ఈ ముగ్గురే కారణమని రమేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

సదాశివనగర్‌లో గుర్తుతెలియని వృద్ధురాలు..



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని దగ్గి గ్రామ శివారులోగల 44వ జాతీయ రహదారిపై సోమవారం ట్రక్ ఢీకొన్నఘటనలో తీవ్రంగా గాయపడ్డ గుర్తుతెలియని వృద్ధురాలు చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై తోట రాజేశ్ తెలిపారు. సదరు వృద్ధురాలు గత కొన్ని రోజులుగా మతిస్థిమితం లేకుండా రోడ్డు వెంబడి తిరుగుతుండేదని స్థానికులు పేర్కొన్నారు. ఈక్రమంలో సోమవారం రహదారిపై ఆమెను ట్రక్ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడింది. వెంటనే ఆమెను కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రాజేశ్ తెలిపారు.

కోటగిరి మండలంలో..



రుద్రూర్: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ గుర్తుతెలియని వృద్ధురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. వివరాలు ఇలా.. కోటగిరి పరిధిలోని సులేమాన్‌నగర్ శివారులో ఇటీవల గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ గుర్తు తెలియని వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. వెంటనే స్థానికులు ఆమెను చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై మచ్చేందర్‌రెడ్డి తెలిపారు. మృతురాలు మహారాష్ట్రకు చెందిన మహిళగా భావిస్తున్నామన్నారు. వివరాలు తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.

ఫోన్ మాట్లాడుతుండగా గుండెపోటు..



తిరుపతి (ఫైల్)

మాచారెడ్డి: ఫోన్ మాట్లాడుతూనే ఓ యువకుడు గుండెపోటుతో కుప్ప కూలి ప్రాణాలు వదిలిన ఘటన మంగళవారం మండలంలోని గజ్యానాయక్ తండా పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. గజ్యానాయక్ తండా గ్రామ పంచాయతీ పరిధిలోని చంద్రునాయక్ తండాకు చెందిన కనికరం తిరుపతి(38) మండలానికి చెందిన ఓ కాంట్రాక్టర్ వద్ద ట్యాంకర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సదరు కాంట్రాక్టర్ లచ్చాపేట, బండ రామేశ్వరపల్లి గ్రామాల మధ్య నిర్మిస్తున్న బ్రిడ్జి వద్ద తిరుపతి ఫోన్ మాట్లాడుతూ గుండె పోటుతో కుప్పకూలిపోయాడు. వెంటనే స్థానికులు తిరుపతిని స్థానిక వైద్యుని వద్దకు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యుడు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి..

నవీపేట: మండలంలోని మహంతం రైల్వే గేటు సమీపంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని రైలు నుంచి జారి పడి గుర్తు తెలియని వ్యక్తి(42) మృతి చెందినట్లు రైల్వే పోలీసులు మంగళవారం తెలిపారు. మృతుడు రైలు తలుపుల దగ్గరగా కూర్చుండగా, ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెంది ఉండవచ్చని వారు పేర్కొన్నారు. మృతుడు నలుపురంగు ప్యాంట్, నీలి రంగు చొక్కా ధరించి ఉన్నట్లు పేర్కొన్నారు.

మాల్తుమ్మెదలో ఒకరి అదృశ్యం



నాగభూషణం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మాల్తుమ్మెద గ్రామానికి చెందిన నాయికోటి నాగభూషణం(48)అనే వ్యక్తి అదృశ్యం అయినట్లు ఏఎస్సై ఉమేశ్ మంగళవారం తెలిపారు. గ్రామానికి చెందిన నాగభూషణం సోమవారం ఉదయం మెదక్ వెళ్లివస్తానని చెప్పి ఇంటి నుండి బయల్దేరాడు. ఇప్పటికీ ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు అతని గాలించారు. అయినా ఫలితం లేకపోవడంతో మంగళవారం నాగభూషణం భార్య నాయికోటి భాగ్యలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

ముషీర్‌నగర్‌లో వివాహిత

సిరికొండ: మండలంలోని ముషీర్‌నగర్ గ్రామానికి చెందిన అల్లెపు ఎల్లవ్వ(40) అనే వివాహిత అదృశ్యమైనట్లు ఎస్సై నర్సింలు మంగళవారం తెలిపారు. ఈ నెల 9న ఇంట్లో ఎవరు లేని సమయంలో ఇంటి నుంచి వెళ్లిన ఎల్లవ్వ ఇప్పటికీ తిరిగి రాలేదన్నారు. దీంతో ఆమె భర్త రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.